
# అభ్యాసము కూసువిద్య



మేరీ సహేలీ సౌజన్యంతో

పెనుమాక
నాగేశ్వరరావు

**"అన్నయ్యా స్నానం చేయరాదూ.. మీ బావగారు వచ్చే వేళ కూడా అయింది. అయన రావడం, వెంటనే స్నానం చేయడం, బాత్రూం నుంచి బయటకు వస్తూనే డైనింగ్ టేబుల్ ముందు 'కూర్చోవటం. ఈ లోగా నువ్వు కూడా స్నానం చేస్తే అందరం కలిసి భోజనాలు పూర్తిచేద్దాం. పొద్దున్నెప్పుడు తిన్నావో" చెల్లెలు విద్య నన్ను స్నానానికి తొందరపెట్టింది.**

పిల్లల్తో కలిసి టీ.వీ. చూస్తూ కూర్చున్న నేను వెంటనే స్నానానికి ఉపక్రమించాను. వంటింట్లోంచి ఘుమఘుమలు నా నోరూరించాయి. నిజం చెప్పొద్దూ ఆర్నెల్లుగా హోటల్ భోజనానికి అలవాటుపడ్డ నాకు ఇంటిపట్టున అయినవాళ్ళతో కలిసి కూర్చుని భోజనం చేయడం చాలా అపురూపంగా అనిపించసాగింది.

ఉద్యోగం వచ్చిన ఉత్సాహంలో వంటా, రుచి పాకాలు, అనుపాకాలు.. ఏవీ పట్టలేదు మొదటి నెల రోజులు. అటు తర్వాత మెల్లమెల్లగా ఇంటి భోజనం మీదికి గాలి మళ్ళింది. అమ్మని నా వెంట తీసుకువెళ్దామనుకున్నాను మొదట్లోనే. ఓ ఆర్నెల్లు అన్నయ్య దగ్గర వుండి వస్తానని అమ్మ అన్నయ్య దగ్గరకు వెళ్ళింది. వదిన పసిపిల్లవాడితో ఇంటిపని చేసుకోలేదని, ఆమెకు సహాయంగా వుండాలనీ అమ్మ ఆకాంక్ష. కాదన్లేక ఒంటరిగా వెళ్ళాను. వంట పనిలో నాకసలు ఏ మాత్రం ప్రవేశం లేదు, ఆసక్తి లేదు. అందుకనే చేతులు కాల్చుకోదల్చుకోలేదు. రెండు పూటలా హోటల్లోనే భోజనం. శనివారాలు సాయంత్రం పూట మాత్రం ఏమీ తినకుండా నిజమైన ఉపవాసం చేయటం అలవాటు చేసుకున్నాను.

మా సహోద్యోగి సలహా మేరకు నా రూముకు దగ్గర్లో వున్న హోటల్లో రాత్రిపూట, ఆఫీసుకు దగ్గర్లో వున్న హోటల్లో పగటిపూట సాపాటు సాగిస్తున్న నాకు, అమ్మ చేతి వంట కాలపైన మనసు మళ్ళింది. ఆటవిడుపు కోసం అప్పుడప్పుడూ హోటల్ మార్చి చూశాను కూడా. అన్నిచోట్లా ఒకే రుచి.

మా కొలీగ్ సూచించిన హోటల్లో హోమ్లీగా వుంటుందని చెప్పాడు. ఏదో అలా అంటారు గానీ అది ఎలా సాధ్యం? ఇల్లు ఇల్లే, హోటల్ హోటలే. అమ్మ, చెల్లెలు, వదిన, అక్క, భార్య .. ఇలా మనవాళ్ళు తయారుచేసి, ఎలా వుందని అడుగుతూ, కొసరి కొసరి వడ్డిస్తూ తినిపిస్తుంటే కలిగే అనందం మరెక్కడా దొరకదు. అనుభవానికి దూరమైనప్పుడు అలాంటివాటి విలువ తెలుస్తుంది, పెరుగుతుంది కూడా.

ఆలోచన్ల మధ్య స్నానం పూర్తిచేశాను. లుంగీ చుట్టుకుని అద్దం ముందు నిల్చున్నాను. కాలింగ్ బెల్ మోగింది. పిల్లలిద్దరూ పోటీపడి పరుగెత్తి తలుపు తీశారు. బావగారు వచ్చారు. కుశల ప్రశ్నలు పూర్తిచేశారు. విద్య చెప్పినట్లే వస్తూనే స్నానానికి బాత్రూంలోకి దూరారు. ఆలోగా చెల్లాయి వంట పదార్థాలన్నీ డైనింగ్ టేబుల్ పైన అమర్చింది.

పిల్లలు, విద్య, బావగారు, నేను భోజనానికి కూర్చున్నాం. చెల్లాయ్ అన్నీ వడ్డించసాగింది. బావగారు నా ఉద్యోగ విషయాలు, ఊరి విషయాలు ముచ్చటించసాగారు.

"డింకూ ఇంకొంచెం కర్రీ వేసుకో"

"పమ్మీ కాస్త చెట్నీ వేసేదా?" పిల్లలిద్దర్నీ అడిగింది విద్య.

"అన్నయ్యా రైస్ పెట్టుకో.. ఇదిగో డిష్" అంటూ నా వైపు నెట్టింది.

"మమ్మీ నాకొంచెం సాల్ట్ కావాలి" అడిగాడు డింకూ.

"వీడికీ, వీళ్ళ డాడీకి ఎంత సాల్ట్ వేసినా చాలదు. ఇదుగోరా పట్టు"

"డాడీ నీకు కర్రీలో కారం సరిపోయిందా?" అడిగింది పమ్మీ.

"ఇంకొంచెం వుండాలమ్మా.. మీ అమ్మ మరీ ఉప్పా కారాలు తగ్గించేస్తున్నది ఈ మధ్య" అని విద్య వైపు అదోలా చూశాడు బావగారు.


అనవసరంగా సిగ్గుపడిపోయాన్నేను.

"మమ్మీ వాటర్"

"పోసుకో. అక్కడే వున్నాయ్‌గా.. మోయలేవా.. సరే మామయ్య పోస్తాడు పోయించుకో."

డింకూగాడి గ్లాసు నీళ్ళతో నింపేన్నేను.

"హోటల్ భోజనం మానేసి చక్కగా



"కవితా మందారం" ఆవిష్కరణ సభలో శ్రీమతి ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి సాహిత్య అకాడమీ (బెంగుళూరు) ప్రాంతీయ కార్యదర్శి శ్రీ అగ్రహారం కృష్ణమూర్తి (కుడి నుంచి రెండు), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం, విశ్వసాహితి అధ్యక్షులు డా. పోతుకూచి సాంబశివరావు, రచయిత్రి ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి తదితరులు.

స్వయంపాకం అలవాటు చేసుకోక పోయావు టోయ్. ఇప్పుడు చేతులు కాల్చుకోవటం మొదలుపెట్టావంటే పెళ్ళయ్యాక సుఖపడి పోతావ్. లేదంటే ఇదిగో నాలాగే అవస్థలు తప్పవ్"

"పేద్ద, వంటగది ముఖం కూడా చూసి ఎరగరు మీరు కబుర్లకి మాత్రం తక్కువుం దరు. కూరలు వండటం మాటలా వుంచండి, మీకు మార్కెట్ నుంచి కొనుక్కు రావటం తెలిస్తే చాలనుకుంటున్నాను." చిరు దరహాసంతో చిరుకోపం మేళవించి అన్నది విద్య.

"చూడవయ్యా మీ అక్క నా పరువెలా తీసి పారేస్తున్నదో. అంటే కూరలు కొనుక్కు రావడం కూడా తెలియనివాడ్ని అని నీకు ఇన్‌డైరెక్టుగా చెపుతున్నదన్నమాట. అంతేగా" ఉడుక్కున్నాడు బావగారు.

"డైరెక్టుగానే అనుకుంటా" అన్నాను ఆయన్ని మరింత ఆటపట్టించాలని.

గలగల నవ్వింది విద్య.

గుర్రుగా నావంక చూసి అలిగినట్లు ముఖం పెట్టిన బావగార్ని చూసి నేనూ నవ్వ కుండా వుండలేకపోయాను.

పిల్లలిద్దరూ కంచాల్లో చేతులు కడిగేసుకుని ఫ్రిజ్ దగ్గరికి పరుగెత్తారు. అందులోంచి నే తెచ్చిన ఐస్‌క్రీమ్ కప్స్ చెరొకటీ తీసుకుని నిలు చునే తినడం ప్రారంభించారు.

"వీళ్ళకి ఐస్‌క్రీంలు, చాక్లెట్లు వుంటే ఇంకేం అక్కర్లేదురా, అన్నంతో కూడా పన్లేదు. బాగా నేర్పారు వాళ్ళ నాన్న'

"అర్థం అయ్యిందా బావమరిదీ. వాళ్ళ దురలవాట్లన్నింటికీ నేనూ, మంచి అలవాట్ల న్నింటికి మీ అక్కా బాధ్యులం అన్నమాట" అంటూ చేయి కడుక్కున్నారు బావగారు.

"కొన్ని కొన్ని విషయాలు చెప్పకుండానే తెలుస్తుంటాయ్ బావగారూ" అన్నాను నవ్వుని ఆపుకుంటూ.

"ఓహో అక్కాతమ్ముళ్ళ తెలివితేటలు ఒక్కటేనన్నమాట. మీ అక్క నీకన్నా ఓ అడుగు ముందే వుందిలే. నీకు కొన్ని విషయాలే తెలుస్తాయామోగానీ ఆమెకు అన్ని విషయాలూ చెప్పకుండానే తెలుస్తుంటాయ్. అదే నే చేసుకున్న పూర్వజన్మ సుకృతం."

"నా పూర్వజన్మ సుకృతం కూడా ఒక టుందిరా తమ్ముడూ! నేను ఏం చెప్పినా మీ బావగారికి వ్యతిరేకంగానే అర్థం అవుతుంది."

విషయం ఎటో వెళ్ళిపోతుందనే అను మానం వచ్చింది నాకు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా టాపిక్ మార్చేశాను.

"డింకూ, పమ్మీ ఇలా రండ్రా" ఐస్‌క్రీం తినటం పూర్తిచేస్తున్న వాళ్ళిద్దర్నీ పిలిచాను.

"ఏంటంకుల్" అంటూ నా దగ్గరకు పరుగెత్తారు వాళ్ళు.

"అంకుల్ ఏంట్రా.. మామయ్య అని పిలవాలి నన్ను" తలలు గుండ్రగా తిప్పారు.

"మీ ఇద్దరికీ అన్నింటికన్నా ఏ పండంటే ఇష్టంరా?"

"పండా? అంటే?" ముఖం చిట్లించింది పమ్మీ.

విస్మయంగా చూశాన్నేను.

"ఇవిగో అందరూ తలా ఓ బనానా తినండిరా" అంటూ పండ్లు పళ్ళెంలో పెట్టుకుని వచ్చింది విద్య.

'ఏమ్మా వీళ్ళకి పండంటే కూడా తెలీదా?"

"అవునన్నయ్యా! పండంటే ఫ్రూట్స్‌రా" అన్నది కొడుకుని ఉద్దేశించి.

బావగారు కూడా ఓ అరటిపండు అందు కుని తినసాగారు.

"అవునమ్మా వీళ్ళు ఇంట్లో కూడా తెలుగు మాట్లాడరా?" సందేహంగా అడిగాను.

నవ్వి వూరుకున్నది విద్య.

"ఇందాక భోజనాల దగ్గర కూడా గమ నించాను. అంతా హోటలు భాషే వాడుతు న్నారు. వాగుతున్నారు. కర్రీ, చెట్నీ, వాటర్, డిష్.. వగైరాలు హోటళ్ళకు వెళ్ళేటప్పుడు అక్కడ హోమ్లీగా వుండాలనుకునే మనమే ఇళ్ళని హోటళ్ళుగా మార్చుకుంటున్నాం తెలుసా?" కాస్తంత మందలింపు ధ్వనించింది నా మాటల్లో.

"స్కూల్లో వాళ్ళ టీచర్లు కూడా ఇదే మంచి పద్ధతి అని చెప్పారన్నయ్యా. పిల్లలకి ఇలా సందర్భం వచ్చినప్పుడల్లా ఇంగ్లీషు నేర్పుతుంటే వాళ్లకి గ్రహింపు శక్తి పెరుగుతుందట" చెప్పింది విద్య.

"ఇంగ్లీషు నేర్చుకోవటం తప్పులేదుగానీ, మన మాతృభాష రాకపోయినా దిగుల్లేకపోవ టం అన్యాయం తల్లీ. వాళ్ళకి ముందు తెలుగు బాగా తెలియనివ్వండి. దయచేసి వాళ్ళని మీరు అన్యాయం చేయవద్దు."

"వార్తలు వస్తున్నాయ్ కాసేపు మీ సంభా షణ ఆపండి. ఆనక తీరిగ్గా వాదించుకుందురు గాని" అంటూ టీ.వీ. ఆన్ చేశారు బావగారు.

మౌనంగా ఆయన పక్కన కూర్చున్నాన్నేను.

"తెలుగు భాష తీయదనం, కమ్మదనం, గొప్పదనం మాటల్లో చెప్పలేనిది. అది మధురమైనది. అందుకే తెలుగువాళ్ళందరం తెలుగే మాట్లాడుకుందాం. నమస్కారం" టీ.వీ.లో ఓ ప్రముఖ రచయిత్రి, నా సోదరి చెప్పిన మాటలు విని నవ్వాలో, ఏడవాలో అర్థంకాని అయోమయంలో పడిపోయాన్నేను.

వార్తలు వినడం పూర్తయ్యాక ఒక్కఘళంగా ఫెళ్ళున నవ్వారు బావగారు. ఆ నవ్వులో నాకు అనేక అర్థాలు వినిపించాయి. అయినాసరే నాకు మాత్రం ఏడుపు తన్నుకు వచ్చింది. తమాయించుకోక తప్పలేదు. విద్య సిగ్గుతో ముఖం చాటేసింది. ❋